
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
సోమవారం 28 అక్టోబరు 2024

కుల గణనకు రెడీ..



- వచ్చే నెల 4 నుంచి ఇంటింటి సర్వే
- నేడు హైదరాబాద్‌లో మాస్టర్ ట్రెయినర్లకు శిక్షణ
- జిల్లా నుంచి సీపీవోతోపాటు ఐదుగురు ట్రెయినర్లకు పిలుపు
- 1400 మంది ఎమ్యూనేటర్ల నియామకానికి అవకాశం
- 150 కుటుంబాలకు ఒక ఎమ్యూనేటర్
- ప్రభుత్వ శాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాల సేకరణ
- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

స్థానిక ఎన్నికలతోపాటు రాష్ట్ర అభివృద్ధి, నూతన పథకాలకు ఉపయోగకరంగా మారే సామాజిక, విద్య ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ కుల గణన సర్వేకు సంబంధించి కసరత్తు పూర్తి చేశారు. ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభించే దిశగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా సర్వేకు సంబంధించిన ఎమ్యూనేటర్లు, ప్లానింగ్‌ను సిద్ధం చేశారు. జిల్లాలో 1300 వరకు బ్లాక్‌లు ఏర్పాటు చేసి దాని ద్వారా 150 కుటుంబాలకు ఒక ఎమ్యూనేటర్‌కు నియమించి సర్వే చేయనున్నారు. ఇందుకోసం జిల్లాలోని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ఉద్యోగుల వివరాలను సేకరించారు. సర్వే కోసం 1400 మంది ఎమ్యూనేటర్‌లను ఉపయోగించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2014లో సమగ్ర సర్వే చేసినా

మిగతా 6లో

జిల్లాలో జనాభా కుటుంబాల వివరాలు (2011 ప్రకారం)

మండలం	జనాభా	కుటుంభాలు
రుద్రంగి	16095	3867
చందుర్తి	33587	8462
వేములవాడ రూరల్	30317	7869
బోయినపల్లి	39240	10235
వేములవాడ	50158	12383
సిరిసిల్ల	92001	22721
కోనరావుపేట	40857	10871
వీర్నపల్లి	13363	3106
ఎల్లారెడ్డిపేట	46270	11527
గంభీరావుపేట	46878	11602
ముస్తాబాద్	44217	10912
తంగళ్లపల్లి	50675	12761
ఇల్లంతకుంట	48379	12676
మొత్త	552037	198992

జిల్లాలో సామాజిక వర్గాల వారీగా జనాభా (2011 ప్రకారం)

మండలం	ఎస్సీ	ఎస్టీ
రుద్రంగి	1556	4278
చందుర్తి	6795	778
వేములవాడ రూరల్	6835	632
బోయినపల్లి	10156	253
వేములవాడ	8235	499
సిరిసిల్ల	6346	1104
కోనరావుపేట	9079	1925
వీర్నపల్లి	2731	5830
ఎల్లారెడ్డిపేట	9390	3185
గంభీరావుపేట	9217	2330
ముస్తాబాద్	10396	1467
తంగళ్లపల్లి	10762	373
ఇల్లంతకుంట	10613	336
మొత్తం	102110	22990

న్యూస్ బాక్స్

నేడు డయల్ యువర్ డీఎం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ కోసం సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఆర్‌టీసీ ప్రయాణికులు వారికి ఎదురవుతున్న సమస్యలు వివరించాలని పేర్కొన్నారు. సెల్ : 9063403773 నెంబర్ ద్వారా కార్యక్రమంలో పాల్గొన్నాలని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని టీఎస్ఆర్టీసీ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సూచించారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఆదివారం మీసకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పాటుపడాలన్నారు. వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం

- జిల్లాలో 42,942 దరఖాస్తులు
- ఇప్పటి వరకు 10,492 పరిష్కారం
- అన్సారీ, జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళికా అధికారి ఇంటర్వ్యూ

ఇంటర్వ్యూ



జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళికా అధికారి అన్సారీ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా సాగుతున్నట్లు, పారదర్శకంగా పరిశీలన పూర్తి చేస్తున్నట్లు జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ అధికారి అన్సారీ తెలిపారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి దరఖాస్తుల పరిశీలన కోసం అదనపు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో అన్సారీ పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ఎలా సాగుతోంది?

టీపీవో : జిల్లాలో రెండు మున్సిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నాం. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ప్రత్యేక ఆదేశాల మేరకు అదనపు బృందాలను ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని బృందాలు ఉన్నాయి?

టీపీవో : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పది మంది సభ్యులతో వార్డుల వారీగా బృందాలు, వేములవాడలో 16 మంది సభ్యులతో బృందాలు, గ్రామీణ ప్రాంతాల్లో 170 మంది సభ్యులతో బృందాలు ఏర్పాటు చేశాం. వీటీడీఏకు సంబంధించి 17 మంది సభ్యులతో బృందాలు దరఖాస్తులను పరిశీలిస్తున్నాయి.

మిగతా 6లో

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్, కలెక్టర్

6

పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఉరితాళ్లే శరణ్యం

- తాజా మాజీ సర్పంచులు


మద్దతు తెలుపుతున్న వికాస్‌రావు

6

నేరాల ఛేదనలో సాక్ష్యాధారాల సేకరణ కీలకం


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేర ఛేదనలో సాక్ష్యాధారాల సేకరణ కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో అన్ని పోలీస్‌స్టేషన్‌ల రైటర్‌లకు ఆరురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విషయాన్ని కూలం కుషంగా నమోదు చేయాలన్నారు. ప్రతీ కేసులో ఫిర్యాదు స్వీకరణ నుంచి కేసు నమోదు, విచారణ, చార్జీ షీట్ దాఖలు వరకు ఏ విధంగా చేయాలనే అంశాలను క్రోడీకరించాలన్నారు. నేరస్థలంలో సాక్ష్యాలు ఎలా సేకరించి కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా కృషిచేయాలన్నారు. సహజసిద్ధంగా ఏర్పరిచిన క్రైమ్ సీన్‌లో రైటర్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీసీఆర్‌బి సిఐ శ్రీనివాస్, పిసిఆర్ సిఐ మధుకర్, డీసీఆర్‌బీ ఎస్‌ఐ జ్యోతి, రైటర్స్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలోని జర్నలిస్టులు డప్పుల కరుణాకర్, నరేష్ తల్లి దేవవ్వ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో, మాట్ల మల్లయ్య, ఇద్దగిరి రేణుక మరణించగా ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, నాయకులు గొట్టె రుక్మిణి పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


చేప పిల్లలను విడుదల చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని రుద్రవరం మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో ఆదివారం చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మత్స్యకార్మికులకు 100 శాతం సబ్సిడీతో ఉచిత చేప పిల్లల పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్నామన్నారు. ఎల్ఎండీలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నెల 4న విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 53 కోట్ల చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. మిడ్‌మానేరులో జలాశయం పరిధిలోని రుద్రవరంలో గతంలో కేజీ కల్చర్ చేపపిల్లల పెంపకంపై అవగాహన కల్పించామన్నారు. మత్స్యకారులు ముందుకు వస్తే సబ్సిడీ ద్వారా కేజీ కల్చర్ చేపల యూనిట్ మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దానికి సరిపడా మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ధార్మిక, కార్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందన్నారు. మన ప్రాంత అభివృద్ధిలక్ష్యంగా ముందుకు పోతున్నామని ఇప్పటికే వేములవాడలో రూ.50 కోట్లతో యారన్ డిపో, రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. మత్స్యకారులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని, ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 8642 మత్స్యకార్మిక కుటుంబాలకు చేతినిండ పని కల్పించేందుకు మిడ్‌మానేరులో మొత్తం 14 లక్షల సైచిలుకు చేప పిల్లలను విడుదల చేయనున్నామని వెల్లడించారు. ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తహసీల్దార్ మహేష్‌కుమార్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య నాయకులు గాలిపెల్లి స్వామి ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

రుద్రంగిని అభివృద్ధి పథంలో తీసుకెళ్తా

రుద్రంగి: రుద్రంగి బిడ్డగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను ఆదివారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత సీసీ రోడ్లుకు రూ. 40 లక్షలు. కేజీబీవీ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ. 7. 50 లక్షలు, దసరానాయక్ తండాకు వేళ్లే సీసీరోడ్డు రోడ్డుకు రూ. 28 లక్షలు, రెండవ శ్మశాన వాటికకు రూ. 13. 50 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సరెడ్డి, కొమిరె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువత గంజాయికి దూరంగా ఉండాలి

చందుర్తి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : యువత గంజాయికి దూరంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం రామన్నపేటలో ఆదివారం రాత్రి మీకోసం పోలీసులు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అందరూ అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ కేసులలో బాధితులు అవుతున్నారన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, వాటి వల్ల జరిగే నష్టాలను తెలిపారు. గ్రామాల్లో మూఢనమ్మకాలు, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సిసికెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాపు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలో ప్రవేశించి పార్వతిపరమేశ్వరులను దర్శిం చుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. భక్తులకు కల్పించిన సౌకర్యాలపై ఆరాతీశారు. లడ్డూ కేంద్రానికి వెళ్లి లడ్డూ నాణ్యతను పరిశీలించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉద్యోగులు సహకరించాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో శ్రావణ తదితరులు ఉన్నారు.

భూముల క్రయ విక్రయాలపై నిషేధం ఎత్తివేయండి


ఆది శ్రీనివాస్‌కు సమస్య వివరిస్తున్న భూముల యజమానులు

వేములవాడ, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో తమ భూముల క్రయవిక్రయాలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేయించాలని యజమానులు వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. ఆదివారం స్థానిక కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలో ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక జగిత్యాల బస్టాండ్ సమీపంలో నూతన బస్టాండ్ నిర్మాణం కోసం భూ సేకరణ చేస్తామని గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బస్టాండ్ నిర్మాణంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. భూ సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసిన కారణంగా తమ భూములను అమ్ముకోలేకపోతున్నామని, వాటిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట లేకపోతున్నామని వారు ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. వేములవాడ పట్టణానికి తిప్పాపూర్‌లో ఇప్పటికే భారీ విస్తీర్ణంలో బస్టాండ్ ఉన్నందున కొత్తగా బస్టాండ్ నిర్మించాల్సిన అవసరం లేదని, ఈ విషయమై పునరాలోచించాలని అన్నారు. నోటిఫికేషన్ను విరమించుకుని తమ భూముల క్రయవిక్రయాలపై ఉన్న నిషేధాన్ని తొలగించే విధంగా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో ఒక కార్యక్రమంలో పాల్గొని చందుర్తి మండలం వైపు వెళుతున్న క్రమంలో వేములవాడ పట్టణ పరిధిలోని కోరుట్ల బస్టాండ్ సమీపంలో భూ యజమానులు రోడ్డుపైనే ఆయనను కలిసి వినతి పత్రం అందజేయడంపై ఆది శ్రీనివాస్ కొంత అసహనానికి గురయ్యారు.

మంత్రి పొన్నంను కలిసిన చక్రధర్‌రెడ్డి


మంత్రి పొన్నంను సత్కరిస్తున్న చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్, అక్టోబరు 27 : బీసీ సంక్షేమ శాఖ మంత్రి, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని నివాస గృహంలో పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి ఆదివారం కలిశారు. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన సందర్భంగా పుష్పగుచ్చం అందించి కండువాతో సత్కరించారు. అనంతరం ఇక్కడి ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు. వర్షాలతో తడిసిన ధాన్యం రైతుల పరిస్థితిని వివరించారు.

యూపీఎల్ అధికారులపై చీటింగ్ కేసు నమోదు

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సంస్థలో కాంట్రాక్టు వ్యవహారాలు చేసిన యూటిలిటీ పవర్ టెక్(యూపీఎల్) సంస్థ అధికారులపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టరుగా పని చేస్తున్న చందా రాధా కిషన్‌రావుకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సుమారు 48 లక్షల రూపాయల బిల్లులు ఇవ్వకుండా తనను వేధిస్తున్నారని రాధా కిషన్‌రావు ఫిరాదులో పేర్కొన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ యూపీఎల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టరు తెలిపారు. రాధాకిషన్‌రావు ఫిర్యాదు మేరకు యుపీఎల్ సీఈవో (నోయిడా) తేంద్ర సింగ్, ఆర్‌ఎం (రామగుండం ఎన్టీపీసీ) కైలాస్ ప్రసాద్, అధికారులు స్వాతి శుక్లా, సీమా ప్రసాద్‌లపై ఎన్టీపీసీ పీఎస్‌లో కేసు నమోదైంది. కాగా యూపీఎల్ సంస్థ కార్యకలాపాలు ఎన్టీపీసీలో చాలా రోజుల క్రితమే నిలిపివేశారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

గన్నేరువరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో మనస్తాపం చెందిన ఓ వృ ద్ధురాలు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చొక్కారావుపల్లికి చెందిన ముస్కు లచ్చవ్వ(80) అనే వృద్ధురాలికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికి పెళ్లిళ్లు చేసింది. లచ్చవ్వ భర్త గతంలోనే మృతి చెందాడు. కూతుళ్ల వివాహం అనంతరం ఇంట్లో ఒక్కతే ఉంటున్నది. వృద్ధాప్యంలో ఉన్న తనను కూతుళ్లు చూసుకుంటారో లేదోనని బెంగతో ఆదివారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. లచ్చవ్వ కుమార్తె నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణాసంచా పట్టివేత

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన బాణాసంచాను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో ఎలాంటి అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ చేశారని సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. రూ. 4.37 లక్షల విలువ గల క్రాకర్స్‌ను సీజ్ చేశారు. సీఐ తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

రామడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నర్సింగారావు చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7,070 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి శేఖర్ తెలిపారు.

ఆదర్శం

రేకుర్తి నేత్ర వైద్యశాల

పేదలకు పెద్దదిక్కు



రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ నేత్ర వైద్యశాల


కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

పేదల ఆసుపత్రిగా పేరుగాంచింది రేకుర్తి నేత్ర వైద్యశాల. అత్యాధునిక సదుపాయాలతో సేవాభావం కలిగిన వ్యక్తుల పర్యవేక్షణలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. దృష్టి లోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా సొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలిస్తారు. ఇప్పటి వరకు 1.8లక్షల మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించారు.

- డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఆలోచనతో అంకురార్పన
- పిడి చేతుల మీదుగా ప్రారంభం
- మూడు దశాబ్దాలకు పైగా సేవలు
- 1,80,000 మందికి కంటి ఆపరేషన్లు

భగత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రి యానాం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకుంటోంది రేకుర్తిలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాల. ఈ ఆసుపత్రిని 1988వ సంవత్సరంలో అనాటి కేంద్ర మంత్రి పీవీ నర్సింహారావు ప్రారంభించారు. మూడెకరాల స్థలంలో ఆహ్లాదకర వాతావరణంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. దేశంలోని నలుమూలల నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. 37 సంవత్సరాలుగా 7.95 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1.8 లక్షల మందికి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. అందులో లక్ష కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు. జిల్లాలోని 65 ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలు అందించారు. నగరానికి చెందిన ఇంజనీర్ కోల అన్నారెడ్డి సహకారంతో 4,190 చనిపోయిన వారి నుంచి కళ్లు సేకరించి ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు. వారానికి నాలుగు గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషన్లు, కంటి అద్దాలు, ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

అందుబాటులో ఆధునిక పరికరాలు

రేకుర్తి నేత్ర వైద్యశాలలో కార్పొరేట్ స్థాయిలో శస్త్రచికిత్సలు, పరీక్షల కోసం అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆరు ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌లు, ఐదు ఆటో రిఫ్రాక్టర్ మీటర్స్ ఐవోఎల్ మాస్టర్, ఏడీ యాగ్లేజర్, విజువల్స్ గ్రీన్లజర్, మూడు ఫాకో మిషన్లు, (సెంచురియన్, లారియేట్, లైజియాన్), ఆటో లెన్సోమీటర్, నాన్ కాంటాక్ట్ టొనమీటర్, హమ్‌ఫ్రేస్ ఫీల్డ్ అనలైజర్, ఎ స్కాన్ బయోమీటర్ ఆక్ట్-2, ఆటో క్లేవ్ ఉన్నాయి. ఆసుపత్రికి మూడు బస్సులు, ఒక మినీ వ్యాన్‌లు ఉన్నాయి. ఈ వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రికి తీసుకొస్తుంటారు.


ఆసుపత్రిలోని అధునాతన పరీక్షా యంత్రం

మరిన్ని సేవలు అందిస్తాం..

- కొండా వేణుమూర్తి, ఆసుపత్రి చైర్మన్



రేకుర్తిలోని భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించేందుకు కృషిచేస్తున్నాము. భవిష్యత్తులో లేజర్ (లాసిక్) పరికరాన్ని ఏర్పాటు చేస్తాం. పేదలకు సేవ చేయాలనేదే ఆసుపత్రి లక్ష్యం.

ప్రత్యేక శస్త్ర చికిత్సలు

కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే శస్త్ర చికిత్సలు రేకుర్తి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక పరికాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఇక్కడ ఉంది. ఆసుపత్రి అభివృద్ధి కోసం చైర్మన్ కొండావేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, వైస్ చైర్మన్ ప్రకాశ్ హోల్లా, సెక్రటరీ బొమ్మ పవన్‌కుమార్, డాక్టర్ మురళీధర్‌రావు, కోల అన్నారెడ్డి కృషి చేస్తున్నారు.

నిష్ణాతులైన వైద్యులు

50 రూపాయల నామ మాత్రపు కన్సల్టేషన్ ఫీజుతో, అతి తక్కువ ఖర్చుతో కంటి శస్త్ర చికిత్సలు ఇక్కడ నిర్వహిస్తారు. నిష్ణాతులైన పది మంది వైద్యులు అందుబాటులో ఉంటారు. ఆసుపత్రిలో 70 మంది సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు.


కంటి శస్త్ర చికిత్స కోసం వేచి ఉన్న రోగులు

విద్యుదాఘాతంతో బోర్‌వెల్ మెకానిక్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఇన్‌సెట్‌లో వైద్య వెంకటేశ్వర్లు(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలో బోర్‌వెల్ మోటార్ మరమ్మతు చేస్తున్న బోర్‌వెల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్ వైద్య వెంకటేశ్వర్లు(57) ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. జీఎం కాలనీకి చెందిన చిన్నవెళ్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన బోర్‌వెల్ మోటార్ పనిచేయడం లేదని బోర్‌వెల్ మెకానిక్ ఎలక్ట్రిషియన్ వెంకటేశ్వర్లును పిలిపించారు. యజమానిని విద్యుత్ సరఫరా నిలిపివేయమని వెంకటేశ్వర్లు చెప్పి స్టార్టర్ ముట్టుకోగా షాక్‌కు గురై మృతిచెందాడు. వెంకటేశ్వర్లు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్థానిక విఠల్‌నగర్‌లో నివాసముండే వెంకటేశ్వర్లు కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. విద్యుత్‌శాఖ పరంగా రూ.5లక్షల పరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఏడీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. వెంకటేశ్వర్లు మృతిచెందడంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కుమారుడు వైద్య నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను పౌరసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా సాయిబాబా కూతురు మంజీర మాట్లాడుతూ సాయిబాబాను ప్రభుత్వమే హత్య చేసిందని ఆరోపించారు. 90శాతం అంగవైకల్యం, పోలియో ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న ఆయనకు మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. సాయిబాబాను అరెస్టు చేసిన సమయంలో ఆయన వీల్ చైర్‌ను కావాలనే ధ్వంసం చేశారని అన్నారు. సమయానికి అత్యవసర మందులు, పుస్తకాలు, ఇతర సామగ్రిని కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. దళితులు, పీడిత ప్రజల పక్షాన, ఆదివాసీలపై ప్రభుత్వాల దమనకాండకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టిందని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్నో సభలు నిర్వహించడంతోనే ప్రభుత్వం ఆయనపై అక్రమంగా ఉపా కేసు మోపి జైల్లో నిర్బంధించిందన్నారు. జైల్లో ఎందరో ఆదివాసీ యువకులను చేయని నేరానికి అక్రమంగా నిర్బంధించారని, వారి కోసం ఒక విద్యాసంస్థను నెలకొల్పే ఆలోచన సాయిబాబకు ఉండేదని ఆమె అన్నారు.

కార్యక్రమంలో విరసం నాయకుడు బాలసాని రాజయ్య, పౌర హక్కుల సంఘం బాధ్యులు శ్రీపతి రాజగోపాల్, నారా వినోద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె విశ్వనాథ్, రిటైర్డ్ ఎంఈవో వీరగోని పెంటయ్య, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, డీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకుడు ముడిమాడుగుల మల్లన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మానవహక్కుల వేదిక బాధ్యులు కె అజయ్, రచయితలు అవునూరి సమ్మన్న, దేవేందర్, విద్యార్థి సంఘం నాయకులు చుక్క గంగారెడ్డి, దొగ్గలి రాజు, రచయిత కందుకూరి అంజయ్య, దళిత హక్కుల పోరాటాల సమితి తాళ్ళపల్లి లక్ష్మణ్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లగౌడ్, సీపీఐ, సీపీఎం, డీటీఎఫ్, ఎంసీపీఐ, మానవ హక్కుల వేదిక, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీర

బెటాలియన్‌లో పోలీసుల నిరసన

- సస్పెన్షన్ ఎత్తివేయాలని

కమాండెంట్ ఆఫీస్ ఎదుట ధర్నా


సిరిసిల్ల బెటాలియన్‌లో ధర్నా చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 17వ బెటాలియన్‌లో పోలీసులు, హెడ్‌కానిస్టేబుళ్ల నిరసనలు కొనసాగాయి. ఏక్‌పోలీస్ అమలు చేయాలంటూ చేసిన ఆదోళనలో సస్పెన్షన్‌కు గురైన 39 మందిలో జిల్లా బెటాలియన్‌కు సంబంధించి బి తిరుపతి, బి శేఖర్ కె స్వామి, ఎ లక్ష్మణ్, శివరామకృష్ణ, కె నవీన్ ఉన్నారు. ఆదివారం వారితోపాటు బెటాలియన్ సముదాయంలో మిగతా పోలీసులు కమాండెంట్ ఆఫీస్ ఎదుట సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏక్ పోలీస్ అమలు చేయాలని శాంతియుత నిరసన చేస్తే కొంత మందిని సస్పెండ్ చేశారన్నారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో నిరసనలో పాల్గొన్న తమను కూడా సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు


ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మానకొండూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి కుమారస్వామి ఆదివారంతన ఆటోలో ప్రయాణికులను కేశవపట్నానికి తరలిస్తున్నాడు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కుమారస్వామి, చింతకుంట గ్రామానికి చెందిన ఎండీ ఖాజతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలెట్ ఖాజ ఖలీల్ ఉల్లా గాయపడ్డ నలుగురిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

ఇబ్రహీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డల జ్యోతి (55) అనే మహిళ గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.... జ్యోతి పదేళ్ల నుంచి షుగర్, బీపీతో పాటు మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం పెద్ద చెరువులో జ్యోతి పడి ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ అనిల్ పరిశీలించి గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు జ్యోతి కుమారుడు గడ్డల విక్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఇల్లందకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన ననబోయిన కవిత (43) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఈ నెల 21న పత్తి తీసే పని కోసం ట్రాక్టర్‌లో వెళ్లింది. ట్రాక్టర్‌ను డ్రైవర్ కుమారస్వామి అజాగ్రత్తగా నడుపడం వల్ల దానిపై కూర్చున్న కవిత ప్రమాదవశాత్తు కిందపడింది. ఆమెకు తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. కవితకు భర్త సమ్మయ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

పాత వాటికి కొత్త రూపం..

ఏదో సాధించాలనే ఆలోచన ఈ యువకుడిది.. నూతన ఆవిష్కరణలతో మూడుసార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. రోబో, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ఎలక్ట్రిక్ బైక్ రూపొందించింది పలువురి ప్రశంసలందుకున్నాడు. పాత వస్తువులకు కొత్త రూపమిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నాడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బోసెట్టి భగత్ ప్రశాంత్...

- వినూత్న రీతిలో వస్తువుల తయారీ
- ఖని యువకుడి అద్భుత ఆవిష్కరణలు


పెట్రోల్ స్కూటీని ఎలక్ట్రికల్‌గా మార్చిన భగత్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదైనా కొత్తగా సాధించాలనే తపన ఆ యువకుడిది. చదివిన చదువుతో తనకున్న జ్ఞానాన్ని జోడించి సరికొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నాడు గోదావరిఖనికి చెందిన భగత్ ప్రశాంత్. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన భగత్ డిప్లమా ఎలక్ట్రానిక్స్, డిగ్రీ బీకాం చదివాడు. పనికిరాని వస్తువులతో రోబోను, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడం, వీల్ రోలర్స్, పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా తయారుచేయడంతో పాటు బైక్ పిస్టన్ ఎయిర్ డివైస్‌ను తయారు చేసి మూడు సార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. పనికి రాని వస్తువులతో సరికొత్త వస్తువులను తయారుచేస్తున్నాడు. పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా మార్చాడు. ఇది గంటకు 22 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళుతుంది. భగత్ చెబుతున్నాడు. ఇలాంటి రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి తన తండ్రికి బహుమతిగా ఇచ్చి, మరొకటి తాను వాడుకుంటున్నాడు. ఇందుకు గాను అప్పటి జిల్లా కలెక్టర్ సంగీతసత్యనారాయణ నుంచి ప్రశంసలు అందుకున్నాడు. అలాగే కొబ్బరి తురుమును తయారు చేసుకోవడానికి ఇళ్లలో మహిళలు ఇబ్బంది పడుతున్నారని గ్రహించిన భగత్ మార్కెట్‌లో ఎక్కువ ధర లభించే వాటికన్నా తక్కువ ధరలో మిషన్‌ను తయారు చేశాడు. ఇలా వినూత్న రీతిలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ అందరితో భళా భగత్ అనిపించుకుంటున్నాడు.


వీల్‌రోలర్‌తో భగత్

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలు

- భగత్‌ప్రశాంత్

చిన్నప్పటికి వస్తువులను తయారు చేయాలనే తపన ఉండేది. అందుకే డిప్లమా ఎలక్ట్రానిక్స్ చదివాను. అప్పటి నుంచి పనికి రాని వస్తువుతో ఏదో ఒకటి తయారు చేస్తూ వస్తున్నాను. తయారు చేసిన రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి నేను, మరొకటి నాన్న నడుపుతున్నాం. వీల్‌రోలర్స్ బైక్ పిస్టమ్ ఎయిర్ మిషన్ తయారు చేశాను. అందుకు మూడుసార్లు వరల్డ్ రికార్డులు అందుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలను రూపొందిస్తాను. నాన్న భగత్ ప్రశాంత్ సైకిల్ రిపేర్ షాపు నడుపుతున్నాడు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో నేను ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాను.

నేపాల్‌లో కరీంనగర్ వాసి మృతి

-ఆధ్యాత్మిక యాత్రలో విషాదం



కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేపాల్ యాత్రకు వెళ్లిన కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పర్వతనేని నర్సింగారావు(60) అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా మరిమడ్ల గ్రామానికి చెందిన నర్సింగారావు చాలా కాలం కిందట కరీంనగర్‌కు వచ్చి ఇక్కడే ప్రగతినగర్‌లో స్థిరపడ్డాడు. అరుణాచలంలోని రుద్రాక్షస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 250 మంది ఈనెల 18న నేపాల్ యాత్రకు వెళ్ళగా, అందులో కరీంనగర్‌కు చెందిన నర్సింగారావు ఉన్నారు. నేపాల్‌లోని పశుపతినాథ్, ముక్తినాథ్, జనక్‌పూర్ ప్రాంతాల సందర్శనలో భాగంగా మూడు రోజుల కిందట ముక్తినాథ్‌యాత్రలో నర్సింగారావు స్నానం చేసే సమయంలో ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే తోటి యాత్రికులు అతన్ని జనక్‌పూర్‌లోని ఒక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. నర్సింగారావు అనారోగ్యంకు గురైన విషయాన్ని కరీంనగర్‌లోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అతని ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు ఎయిర్ అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేస్తుండగా ఆదివారం ఉదయం మృతి చెందాడు. నర్సింగారావుకు భార్య, కూతురు, కొడుకులున్నారు. నర్సింగారావు కరీంనగర్‌లో ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. నర్సింగారావు మృతదేహాన్ని కరీంనగర్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సింగారావు మృతి పట్ల ప్రగతినగర్ అభివృద్ధి, సంక్షేమ సంఘం ప్రతినిధులు, తోటపల్లి తాజా మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగారావు, మానేరు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి


వెంకటేష్(ఫైల్)

మల్లాపూర్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామంలోని గోదావరి నదికి తన్నీర్ వెంకటేష్ (27) అను తాపీ మేస్త్రి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఆదివారం నీట మునిగి మృతి చెందాడు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తు న్న తన్నీర్ వెంకటేష్ ఆదివారం పనులకు సెలవు కావడంతో తోటి కూలీలతో కలిసి గోదావరి నదికి స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో ఈత రాకపోవడంతో వెంకటేష్ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి కూలీలు, స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వృద్ధుడు..

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని చెరువులో ప్రమాదవశాత్తు నీట మునిగి పోచెట్టి మాలద్రి(65) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి చెందిన పోచెట్టి మాలద్రి జగ్గసాగర్ గ్రామంలోని ఓ మేస్త్రి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని చెరువులో ఒడ్డున ఉండి స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి నీటిలో మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానిన పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కోరుట్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న సెకండ్ సేల్స్ కారు

సెకండ్ హ్యాండైనా.. కొనేద్దాం..

- మార్కెట్‌లో యూజ్డ్ కార్లకు డిమాండ్
- కొత్త వాటితో పోలిస్తే పాతిక శాతం ధరల్లోనే లభ్యం
- మక్కువ చూపుతున్న మధ్య తరగతి వర్గాలు

పాతదో, కొత్తదో ఇంటికో కారు ప్రస్తుత రోజుల్లో సాధారణమైపోయింది. ఎవరి ఆర్థిక పరిస్థితిని బట్టి వారికి అందుబాటులో ఉన్న కారును కొనుక్కుని అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నారంటే చాలు కారు అవసరం ఉంటోంది. అందరూ కలిసి పండగలకు ఊరు వెళ్లాలన్నా, ఏ విహార యాత్రలకు వెళ్లాలన్నా స్వంత కారైనా లేదా అద్దె కారైనా తీసుకుని వెళ్తున్నారు. వినియోగదారుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. అందుబాటు ధరల్లో ఉండడంతో పాటు ఫైనాన్స్ సౌకర్యం కూడా కల్పిస్తుండడంతో కొనేందుకు ముందుకు వస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు లేటెస్ట్ వర్షన్‌లతో కొత్త కార్లు మార్కెట్లోకి రావడంతో యజమానులు పాత వాటిని తీసేసి కొత్తవి కొంటున్నారు. దీంతో మార్కెట్లో మంచి కండిషన్ ఉన్న కార్లు అమ్మకానికి పెట్టేస్తున్నారు.

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ కారులో తిరగాలనే కోరిక ఉండటం సహజమే. సొంత ఇల్లు అనే కోరిక నెరవేరిన తర్వాత ప్రతి మనిషికి ఉండే స్వప్నం కారు. ఇల్లు, ఇంటి ముందు కారు ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇప్పుడున్న ప్రస్తుత సమాజంలో కార్లను కొనేందుకు ఎంతో మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమంది మాత్రం మార్కెట్లోకి ఏ కొత్త రకం కారు వస్తే దానిని కొనేస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే కస్టమర్స్‌ను ఆకర్షించేలా పలు రకాల కార్లు అందుబాటులోకి వస్తున్నాయి. మరి కొంతమందికి కారులో తిరగాలని కోరిక ఉన్నా, కారు కొనుగోలు చేసే స్తోమత లేక వెనకడుగు వేస్తుంటారు. మరికొంత మంది మాత్రం కొత్త కారుకు బదులు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలు చేస్తుంటారు. అందుకు అనుగుణంగా కస్టమర్లను ఆకట్టుకునేలా అన్ని రకాల సెకండ్ హ్యాండ్ కార్స్ కన్సల్టెన్సీలో అందుబాటులో ఉంటున్నాయి. జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి తదితర పట్టణాల్లో సుమారు పాతిక వరకు సెకండ్ హ్యాండ్ కార్స్ సెల్స్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి.


జగిత్యాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న యూజ్‌డ్ కార్లు

● అప్ గ్రేడ్ వర్షన్‌లోకి మారుతుండడం వల్లే...

ఇక ఇప్పటికే కార్లున్నవారు అప్‌గ్రేడ్ వెర్షన్‌లోకి మారడం కూడా యూజ్డ్ కార్ల మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున వాహనాలు వచ్చేలా చేస్తున్నది. ఇదిలా ఉంటే కుటుంబం మొత్తం తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉం డటం, ప్రైవసీ, ఇతరత్రా సౌకర్యాల వల్ల కూడా ఇప్పుడు మధ్యతరగతి వర్గాలు యూజ్డ్ కార్లపైనే మక్కువ చూపిస్తున్నారు. మొత్తానికి లగ్జరీ కార్ల దగ్గర్నుంచి మిడిల్, స్మాల్ సెగ్మెంట్లలోని కార్లు ఈ ప్రీ-ఓన్డ్ వెహికల్స్ మార్కెట్‌లో లభిస్తున్నాయి.

● అందుబాటు ధరల్లో..

ప్రీ ఓన్డ్ వెహికల్ బిజినెస్ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. నచ్చిన కార్లు సరసమైన ధరలకే లభిస్తుండడం, ఫైనాన్స్ సౌకర్యం కూడా ఉండటం, వారంటీలు ఇస్తుండడంతో పలువురు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.కొత్త కార్ల ధరలతో పోల్చితే 15-25 శాతం ధరల్లోనే యూజ్డ్ కార్లు అందుబాటులో ఉంటుండటం ఇప్పుడు ఈ మార్కెట్‌ను పరుగు పెట్టిస్తున్నది. సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేయడం వల్ల కొత్త కారుతో పోలిస్తే డబ్బులు చాలా ఆదా అవుతాయి.మార్కెట్‌లోకి రకరకాల వేరియంట్లు, అబ్బురపరిచే ఫీచర్లతో వస్తుండడంతో చాలా మంది ఇప్పటికే ఉన్న పాత కార్లను అమ్మేస్తున్నారు. ఇందుకు సెకండ్ హ్యాండ్ కార్ సేల్ సెంటర్లు చక్కటి వేదికలుగా నిలుస్తున్నాయి. ఇక అటు అమ్మే వారికి, ఇటు కొనే వారికి లాభదాయకంగా లావాదేవీలు జరుగుతుండడం...ఈ బిజినెస్‌ను బడా మార్కెట్‌గానే మార్చేస్తోంది. ఏదైనా కంపెనీకి చెందిన ఓ మోడల్ కొత్త కారు ధర రూ. 10 లక్షలుగా ఉంటే...అదే మోడల్ పాత కారు ధర రూ. 2 లక్షలుగానే ఉండటం...కస్టమర్లను ఈ వైపు చూసేలా చేస్తున్నదని మార్కెట్ వర్గాలు ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నాయి. కండీషన్‌లో ఉండి, తక్కువ కిలో మీటర్లు తిరిగి, అప్‌గ్రేడ్ వెర్షనైతే మరో రూ. 50,000ల నుంచి రూ. లక్ష రూపాయలు ఎక్కువగా పెట్టుకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. దీంతో అన్ని విధాలా సరిపోయే కారు రూ. 2.5 లక్షలు - రూ. 3 లక్షల్లో వచ్చేస్తున్నది.

నచ్చిన కార్లు...తక్కువ ధరల్లోనే..
- కట్కం ప్రసాద్, జగిత్యాల జిల్లా



నచ్చిన కార్లు సరసమైన ధరల్లోనే అందుబాటులో లభిస్తుండడంతో చాలా మంది సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న కార్లను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ప్రయాణానికి సైతం సౌకర్యవంతంగా ఉంటున్నాయి.

ఫైనాన్స్ సౌకర్యం సైతం ఉంటోంది
- దొనికెల నవీన్, యువకుడు, జగిత్యాల జిల్లా



సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్న యజమానులకు ఫైనాన్స్ సౌకర్యం సైతం అందుతోంది. తక్కువ ధరలో మంచి మోడల్ కారు లభిస్తుండడంతో దీనికి తోడు తక్కువ వడ్డీతో ఫైనాన్స్ సౌకర్యం ఉంటుండడం వల్ల సెకండ్ సేల్స్ వైపు వినియోగదారులు ఆసక్తికనబరుస్తున్నారు.

మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో..
- ప్రభురాజ్ లక్ష్మీ నర్సయ్య, ప్రయివేటు డ్రైవర్, జగిత్యాల జిల్లా



మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. ఇందు వల్ల చాలా కుటుంబాలు సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేసి తమ కలను నిజం చేసుకుంటున్నారు. మార్కెట్‌లో వస్తున్న కొత్త వర్షన్ కార్లపై క్రేజీ పడుతున్న కొందరు తమ వద్ద ఉన్న పాత కారును ఎంతో కొంతకు అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేసి మధ్య తరగతి కుటుంబాల సభ్యులు వినియోగిస్తున్నారు.

న్యూస్ బాక్స్

కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలోని సుమారు 50 మంది విద్యార్థినులు ఆదివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థినులకు ఒక్కసారిగా 50 మందికి పైగా దగ్గు రావడంతో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు గమనించి ప్రాథమిక చికిత్స అందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వాతావరణ మార్పుల వల్ల విద్యార్థులు దగ్గరదగ్గరగా ఉండడంతో దగ్గు అందరికీ వ్యాపించిందని వైద్యుడు అమరేందర్ తెలిపారు. విద్యార్థులు ఆ సమయానికి భోజనం చేయలేదు కనుక ఫుడ్ పాయిజన్ కాలేదని నిర్ధారించారు. తొమ్మిది గంటల వరకు విద్యార్థినులకు దగ్గు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు నిర్ధారణ చేశారు. కాగా, విద్యార్థినులకు ఒక్కసారిగా దగ్గు రావడంతో స్థానికంగా ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పాఠశాల వద్దకు వెళ్లడంతో వారిని ఆవరణలోకి అనుమతించకపోవడంతో కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యార్థినులు దగ్గుతో ఇబ్బంది పడుతున్నారన్న ఆందోళనతో తల్లిదండ్రులు వివరాలు అడిగేందుకు ప్రయత్నించారు. అయితే పాఠశాల లోపల ఉన్నవారు గేట్లకు తాళాలు వేసి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ తో పాటు ప్రైవేటు వాహనాల్లో తల్లిదండ్రులు, స్థానికుల సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి విద్యార్థినులను సమయానికి తరలించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

'రాజన్న' గోశాల పరిశీలన

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న గోశాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. కోడెలకు సకాలంలో మేత వేయాలని ఉద్యోగులకు సూచించారు. కట్ట కింద గోశాలను, కొత్తగా వచ్చిన ఆరు కోడెలను పరిశీలించారు. సోమవారం సందర్భంగా భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున నందీశ్వర, లక్ష్మీగణపతి ధర్మశాలలను పరిశీలించారు. ఆయన వెంట ప్రోటోకాల్ మరియు గదుల విచారణ పర్యవేక్షకులు జి అశోక్ కుమార్, గోశాల ఇన్‌చార్జి వి పరమేష్ ఉన్నారు.

జాతీయ యోగాలో తెలంగాణకు పసిడి పతకం

- రికార్డు సృష్టించిన దీపక్



బంగారు పతకంతో దీపక్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీల్లో తెలంగాణకు తొలిసారిగా స్వర్ణ పతకం లభించింది. జిల్లాలోని మానకొండూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పి దీపక్ సబ్‌జూనియర్ విభాగంలో పసిడి పతకం సాధించి రికార్డు సృష్టించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉనాలో ఈనెల 24 నుంచి 27 వరకు జరిగిన జాతీయ పోటీల్లో దీపక్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా దీపక్‌ను, కోచ్ రామకృష్ణను తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.


జూడో పోటీల్లో సత్తా చాటాలి

- రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కదారి అనంతరెడ్డి


పోటీలను ప్రారంభిస్తున్న కదారి అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తాచాటి చాంపియన్‌గా నిలవాలని రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కదారి అనంతరెడ్డి అన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల జూడో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యానికి, ఆత్మ విశ్వాసానికి జూడో క్రీడ ఎంతగానో దోహద పడుతుందన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 150 మందికిపైగా బాలబాలికలు హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను వరంగల్ జిల్లాలో జరిగే 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరితరెడ్డి, పీడీలు, పీఈటీలు రమణ, విద్యాసాగర్, శ్రీధర్, శ్రీనివాస్, సుధాకర్, నరేందర్, కోచ్ సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రుచిత్‌రెడ్డి

ఇల్లంతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అంకిళ్ళ రుచిత్‌రెడ్డి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రుచిత్‌రెడ్డి పాఠశాల స్థాయి క్రీడలలో అండర్ 17విభాగంలో ఇటీవల గోదావరిఖనిలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్ఎం పావని, వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బట్టు పద్మ తదితరులు అభినందించారు.

రాష్ట్రంలో యువజన కమిషన్ ఏర్పాటు చేయాలి

- యువతకు ఉపాధి కల్పనలో మోదీ సర్కారు విఫలం
- సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌నకు చాడా వెంకట్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చి 76ఏళ్లు దాటుతున్నప్పటికీ దేశంలో ఆర్థిక అసమానతలు అలాగే ఉన్నాయన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వల్ల దక్కిన ప్రాథమిక హక్కులను సైతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరిస్తోందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత మత రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తున్నాడని విమర్శించారు. దేశంలో యువకు ఉపాధి మార్గాలు చూపించకుండా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీని మోదీ మర్చిపోయాడన్నారు. 10 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. దేశంలోని సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ఆల్ ఇండియా యూత్ పెడరేషన్(ఏఐవైఎఫ్) జాతీయ క్యాదర్శి తిరుమలై రామన్ ప్రసంగిస్తూ సిద్ధాంతపరమైన రాజకీయ, శాస్త్రీయ ఆచరణకు వర్క్‌షాప్‌లు దోహదపడుతాయన్నారు. విద్య, ఉపాధి, వైద్యం కోసం నేటి యువత పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస్ కుమార్, మార్కురురి సూర్య, నాయకులు రవి, శంకర్, యుగంధర్, శ్రీనివాసులు, రామకృష్ణ, మహేందర్, కొండల్, మహేశ్, చిలుక రాజు, శ్రీను, సదానందం, గౌతం, మోహన్, కనకరాజు, ప్రజానాట్యమండలి కళాకారులుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వరద కాలువలో వైద్యుడి గల్లంతు


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ, ఇన్‌సెట్‌లో పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రా మంలోని విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొడుతూ పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(29) అనే వైద్యుడు ఆదివారం గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, రాయికల్ మండల కేంద్రాల్లో వైద్యులుగా పనిచేస్తున్న పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ స్నేహితులు. ఆదివారం వారంతా సరదాగా గడపడానికి మరో ఇద్దరు వైద్యులు ఆత్మకూరి రాజు, లింగాల నిఖిల్‌తో కలిసి మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొట్టేందుకు ఆగారు. కాలువలో స్నానం చేయడానికి వారంతా దిగారు. ఈత కొడుతుండగా ఉదయ్‌కిరణ్ రెడ్డి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే ఒడ్డుకు చేరుకుని అక్కడే ఉన్న జాలర్లకు విషయం తెలిపారు. జాలర్లు ఎంత ప్రయత్నించినా ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆచూకీ తెలియలేదు. పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం అందించి నీటి ప్రవాహం తగ్గించేందుకు వరుదకాలువ గేట్లు మూసివేయించారు. అప్పటికే చీకటి పడిపోవడంతో గాలింపు చర్యలకు ఆటంకంగా మారింది. ఉదయ్‌కుమార్‌రెడ్డి హనుమకొండ జిల్లా వేలేరు గ్రామానికి చెందిన వాడు. ఆయన గల్లంతైన విషయాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులు సమాచారం అందించారు.

దిగువ మానేరులో అరుదైన పక్షులు

- కరీంనగర్‌కు వలస వచ్చిన ఇండియన్ స్కిమ్మర్స్
- ఈ ప్రాంత జీవ వైవిధ్యానికి కొత్త అందం..


మానేరు డ్యాంలో ఇండియన్ స్కిమ్మర్స్ పక్షులు




పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్ వాచర్స్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్కిమ్మర్స్.. ఈ పక్షులు అరుదైనవి.. ఇవి మధ్యప్రదేశ్, రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రవహించే చంబల్ నది, ఒడిస్సాలోని మహానది ఇసుక మేటల్లో నివసిస్తూ ఉంటాయి. శీతాకాలంలో ఆహారం కోసం సముద్ర తీర ప్రాంతాలకు వలస వెళుతుంటాయి. అటువంటి ఇండియన్ స్కిమ్మర్స్ కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాంలో కనిపించాయి. ఈ పక్షులు గత ఏడాది లోయర్ మానేరు డ్యాంకు వలస వచ్చినట్లుగా ఐయూసీఎన్ (ఇంటర్‌నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) వారు గుర్తించారు. అరుదైన పక్షులు ఈ ప్రాంతానికి వలస రావడంతో పక్షి ప్రేమికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు వీటి రాకతో ఈ ప్రాంత జీవవైవిధ్యానికి కొత్త అందం చేకూరినట్లైంది. ఈ నెలలో ఇండియన్ స్కిమ్మర్స్ లోయర్ మానేరు డ్యామ్‌లో రెండోసారి కనబడినట్లు ఈ-బర్డ్‌లో రికార్డయ్యింది. ఈ అరుదైన పక్షుల గురించి తెలుసుకోవడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ప్రయత్నించారు. ఈ పక్షుల సంఖ్యను లెక్కించడంతోపాటు, వాటి రూస్టింగ్ (విశ్రాంతి)ప్రదేశాలను కనుగొన్నారు. ఈ సమాచారాన్ని కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అంతరించిపోతున్న ఇండియన్ స్కిమ్మర్స్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని చర్చించారు.

● ఇండియన్ స్కిమ్మర్స్ ప్రత్యేకతలు....

ఇండియన్ స్కిమ్మర్స్ నలుపు రంగులోను, తెలుపు రంగులో ఉంటాయి. ముక్కు ముదురు నారింజ రంగులో, ముక్కు చివరి భాగం పసుపు రంగులో ఉంటుంది. ముక్కుపై భాగం చిన్నగా, కింద భాగం పెద్దగా ఉంటుంది. ఇవి రివర్ టెర్న్ పక్షులను తలపించేలా ఉన్నప్పటికీ, ఆహారాన్ని సేకరించే విధానాన్ని బట్టి వీటిని ప్రత్యేకమైన పక్షులుగా గుర్తించవచ్చు. ఇవి నది ఉపరితలంపై ఎగురుతూ ముక్కుతో నీటిలోని చేపలను అందుకొని గాలిలోనే ఎగురుతూ చేపలను తింటాయి. ఈ కారణంగా వీటిని స్కిమ్మర్స్ అని పిలుస్తారు. ఇవి దక్షిణాసియా భూభాగానికి మాత్రమే పరిమితం. వీటి సంఖ్య అత్యంత వేగంగా తగ్గుతున్నది. గత మూడేళ్లలో 30 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం ఇండియాలో ఈ పక్షులు సుమారు 2,700 ఉండొచ్చని ఒక అంచనా. ఇవి సాధారణంగా జనాల అలికిడి లేని నది, సముద్రం మధ్యలోని ఇసుక మేటల్లో, ద్వీపాల్లో నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. దిగువ మానేరు జలాశయం మధ్యలో పెద్ద బండరాళ్లు, చిన్న చిన్న ద్వీపాలు ఉండటంతో ఇండియన్ స్కిమ్మర్స్ వాటిలో ఆవాసం ఏర్పాటు చేసుకుని మానేరు జలాశయం నీటిలో చేపలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటూ జీవిస్తున్నాయి. అరుదైన ఇండియన్ స్కిమ్మర్ పక్షుల సమాచారాన్ని కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) వ్యవస్థాపకులు మూటపల్లి గంగాధర్, మధు గోసిక, అబ్దుల్ రహీం, వివేక్ మాత కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించారు.

కుల గణనకు రెడీ..

3వ పేజీ తరువాయి..

కులగణనకు సంబంధించి దమాషాను వెల్లడించలేదు. ప్రస్తుతం రానున్న స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ జనరల్, రిజర్వేషన్ల ఖరారు కోసం కులగణన దోహదపడనుంది. కుల గణనపై అన్ని రాజకీయ పక్షాలు, ప్రజల్లో ఆసక్తి ఏర్పడింది.

నేడు మాస్టర్ ట్రెయినర్లకు శిక్షణ

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్రసర్వే కుల గణనకు సంబంధించి మాస్టర్ ట్రెయినర్లకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల భవనంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లా నుంచి సీపీవోతోపాటు మరో ఐదుగురు ప్రణాళిక సంఘానికి సంబంధించిన వారు మాస్టర్ ట్రెయినర్లుగా శిక్షణకు వెళ్తున్నారు. కులగణన జిల్లా ప్రణాళికా సంఘం పర్యవేక్షణలోనే సాగనుంది. రెండు నెలల పాటు పకడ్బందీగా కులగణన జరగనుంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా 171 రెవెన్యూ గ్రామాలు, 327 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇందులో 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 5 లక్షల 52 వేల 37జనాభా ఉంది. ఇందులో పురుషులు 2,74,109 మంది, మహిళలు 2,77,928 మంది ఉన్నారు. కుటుంబాలు 1,38,992 ఉన్నాయి. ఇందులో ఎస్సీలు 1,02,110 మంది ఉండగా పురుషులు 50,290, మహిళలు 51,820, ఎస్టీలు 22,990 మంది ఉండగా పురుషులు 11,342, మహిళలు 11,648 మంది ఉన్నారు. సెన్సెస్ జరగకపోవడంతో కుటుంబాల సంఖ్య పెరిగింది. దానికి అనుగుణంగానే సర్వేలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

సర్వేలో సేకరించే వివరాలు

సమగ్ర సర్వే కులగణనను నవంబరు 4న ప్రారంభించనున్నారు. సర్వేలో ఒక ఎన్యూమరేటర్ 150 ఇళ్లకు వెళ్లి సర్వే చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన సర్వేకు సంబంధించిన ప్రశ్నావళిని మంత్రి మండలి ఆమోదించింది. సర్వేకు సంబంధించిన పూర్తి మార్గనిర్దేశనం ఈ నెల 28న కలెక్టర్లతో సీఎం నిర్వహించే కాన్ఫరెన్స్‌లో వెల్లడి కానుంది. ప్రతీ ఇంటికి వెళ్లి నిర్వహించే సర్వేలో 7 పేజీలతో 54 ప్రశ్నలతో వివరాలు సేకరించనున్నట్లు సమాచారం. కుటుంబ యజమాని నుంచి మొదలుకొని అతనికి సంబంధం ఉన్న వారి కులం, ఉప కులం, మాతృభాష, విద్య, ఆస్తుల వివరాలు, రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందిన వివరాలు, ఇలా అనేక వివరాలను సేకరించనున్నారు. అధికారులకు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. సోమవారం జరిగే శిక్షణలో పూర్తి వివరాలు అందిస్తారని భావిస్తున్నారు.



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం

వచ్చే నెల 1న బీసీ కమిషన్ రాక

కరీంనగర్‌లో వచ్చే నెల 1న బీసీ కమిషన్ బృందం స్థానిక సంస్థల్లో కల్పించే రిజర్వేషన్ల ప్రక్రియపై అభిప్రా యాలను సేకరించనుంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో నవంబరు 1న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ, బీసీ వెల్ఫేర్ కమిషనర్ల బృందం అభిప్రాయాలను సేకరించనుంది. నిర్దేశిత నమూనాలను సంబధించి వెరిఫికేషన్ అఫ్‌డెవిట్ అరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషాల్లో ఇచ్చే విధంగా సూచనలు చేశారు.

న్యూస్ బాక్స్

నేడు 2కే రన్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలో సోమవారం ఉదయం 6 గంటలకు 2కే రన్ ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ 2కె రన్ పట్టణంలోని బతుకమ్మ ఘాట్ నుంచి నేతన్న చౌరస్తా, గాంధీ చౌరస్తా మీదుగా సాగుతుందని తెలిపారు.

ప్రతిపక్షాల నేతల ఇళ్లపై దాడి సరికాదు

ముస్తాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షల నేతల ఇళ్లపై దాడి సరికాదని, వారెంటు లేకుండా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటి ఎదుట దైర్జన్యంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని ముస్తాబాద్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో ఆదివారం మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులు చేయడంపై మండిపడ్డారు. ఎక్కడి ఏది జరిగినా కేటీఆర్‌తో సంబంధం అంట గుడుతున్నారని అభివృద్ధిని మరిచి ప్రతిపక్ష నేతలపై కక్ష్య పూరితంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. నాయకులు రమేశ్‌రెడ్డి, సంతోష్‌రావు, చెవుల మల్లేశ్, మెంగని మనోహర్, శీలం స్వామి, కోడె శ్రీనివాస్ తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ దేవస్థాన పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ దేవస్థానంలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎస్ సౌకర్యాలు కల్పిస్తూ అదనపు పని గంటలకు అదనపు వేతనాలు చెల్లించాలని అన్నారు. కార్మికులకు ప్రమాద బీమా , ఎనిమిది గంటల పని విధానం అమలు చేస్తూ కనీస వేతన చట్టం కింద రూ. 26900 చెల్లించాలని డిమాండ్ చేశారు. వేములవాడ ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

బూత్ పరిధిలో 100 మందిని బీజేపీ సభ్యులుగా చేర్చాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ప్రతీ కార్యకర్త, నాయకుడు వారి బూత్ పరిధిలో కనీసం 100 మందిని బీజేపీ సభ్యులుగా చేర్చాలని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని ఓ బంకెట్ హాల్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వికాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ పార్టీలో నూతనంగా 100 మందిని సభ్యులుగా చేర్పించిన వారికి క్రియాశీల సభ్యత్వం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వాలను చేయించాలని సూచించారు. అనంతరం పట్టణంలో ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదులు చేయించారు. అనంతరం వికాస్‌రావును బీజేపీ పట్టణ శాఖ నాయకులు సన్మానించారు. బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ సంతోష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శులు కొండ నరేష్, ఎనగంటి నరేష్, పట్టణ ఉపాధ్యక్షులు చొప్పదండి అంజన్న, ఉరవకొండ రాజు, మోర శ్రీహరి, రమేష్‌చారి, పంపరి అర్జున్, చొప్పదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న వికాస్‌రావు

పలువురికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు పదిరలో ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులతోపాటు గాయకుడిని గోపా సంఘం సభ్యులు, మాజీ సెస్ డైరెక్టర్ మల్లారెడ్డి ఆదివారం సన్మానించారు. మండల కేంద్రంలో తిమ్మాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్‌కు చెందిన ఉపాధాయులు శ్రీనివాస్‌గౌడ్, ఆకుల శేఖర్‌గౌడ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, రంగు ప్రవీణ్‌గౌడ్‌ను సన్మానించారు. పదిర గ్రామంలో గాయకుడు తాళ్లపల్లి సురేశ్‌ను మాజీ సెస్ డైరెక్టర్ కుంభాల మల్లారెడ్డి సన్మానించారు. సురేశ్ పొట్టకూటి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లి గల్ఫ్ జీవితాలపై ఎన్నో పాటలు రాసి గాయకుడిగా మంచి గుర్తింపు పొందడం పట్ల అభినందించారు. నాయకులు రమేశ్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, నారాయణగౌడ్, కృష్ణహరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఉపేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఉరితాళ్లే శరణ్యం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (అక్టోబరు): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడదల చేయాలని, లేని పక్షంలో తమకు ఉరితాళ్లే శరణ్యమని తాజా మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. తాజా మాజీ సర్పంచుల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శిబిరంలో తాజా మాజీ సర్పంచులు మెడకు ఉరితాళ్లతో వినూత్న నిరసన చేపట్టారు. బీజేపీ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి వికాస్‌రావు, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, న్యాయవాది పొత్తూరి అనిల్, సిరికొండ శ్రీనివాస్ దీక్ష శిబిరాన్ని సందర్శించారు. తాజా మాజీ సర్పంచులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వికాస్‌రావు మాట్లాడుతూ తాజా మాజీ సర్పంచుల డిమాండ్లు న్యాయమైనవే అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులను చేపట్టారని, గత ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల విడుదల కోసం చేస్తున్న వారి ఉద్యమానికి బీజేపీ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నర్మెట సరేష్, అనిల్, తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కోశాధికారి వన్నమనేని వంశీకృష్ణ, కార్యదర్శులు, తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆవునూర్



ఆవునూర్ శోభాయాత్రలో మహిళలు

ముస్తాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణతో మండలంలోని ఆవునూర్ గ్రామం మార్మోగింది. పాడి పంటలకు , ఆధ్యాత్మికతకు ప్రసిద్ధి గాంచిన ఆవునూర్ రామాలయ వార్షికోత్సవాన్ని శ్రీ వెంకటేశ్వర భజన మండలి మహిళలు వెంకటేశ్వర నామ స్మరణతో పాటలు పాడుతూ నృత్యాలు స్వామి వారి చిత్రపటంతో పురవీధుల్లో ఉరేగింపు తీశారు. వెంకటేశ్వర స్వామి వేషధారణతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షురాలు రాజూరి లక్ష్మీ, ఏనుగు జ్యోతి, ఏనుగు మధుమిత, లావణ్య, విజయ, కళ్యాణి, రేణుక, సునీత, బద్ది పద్మ, నాయకులు ఏనుగు వేణు, నక్కదాసరి రవి, బద్దెపురి కళ్యాణి, దాసరి విశ్వనాథం, సతీశ్‌చందర్‌రావు, కటకం రాములు, సారగొండ రాంరెడ్డి, పద్మారెడ్డి మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంటాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రం ప్రారంభిస్తున్న వ్యాపారులు, రైతులు

గంభీరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి అన్నారు. కొనుగోలు కేంద్రాలను అన్ని వసతులతో ఏర్పాటు చేస్తున్నామని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేరుగా తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, బ్లాక్ కాంగ్రెస్ ఇంచార్జీ దొమ్మాట నర్సయ్య, బీసీ సంక్షేమ సంం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, సింగిల్‌విండో వైస్ రామాంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, డైరెక్టర్లు లింగం, బాల్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, ప్రభాకర్, విఠల్, అజాం, సింగిల్ విండో డైరెక్టర్లు మల్యాల రాజవీర్, అంజిరెడ్డి పార్టీ సోషల్ మీడియా ఇంచార్జీ గౌరి శంకర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫలించిన బీసీ సంక్షేమ సంఘం పోరాటం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులగణన ఒక వరమని, పోరాటం ఫలించిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో పర్శ హన్మాండ్లు మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం పోరాటాల ఫలితమే నిన్నటి రోజు బీసీ కులగణనకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కామారెడ్డి సభ డిక్లరేషన్‌లో బీసీలకు కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థ ఎన్నికలను నిర్వహిస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసిందని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని చిత్తశుద్ధితో అమలు చేయడం కోసం జీవో నంబరు 18ని తీసుకొస్తూ రూ.150 కోట్లు కేటాయింపు హర్షనీయమన్నారు. నవంబరు 4 నుంచి 31 వరకు కులగణన చేపట్టాలని ప్రభుత్వ నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం స్వాగతిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం పూర్తయిన క్రమంలో పాత రిజర్వేషన్ల శాతంతో ఎన్నికలను నిర్వహించాలని ఆలోచన చేసిందన్నారు. కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి టూ కరీంనగర్ యాత్ర, హైదరాబాద్‌లో అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్షం సమావేశం, కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, బీసీ మార్చ్ నిర్వహించామన్నారు. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సంఘం సభ్యులతో సంప్రదింపులు చేసి బీసీ కులగణన తర్వాతనే ఎన్నికలను నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 18 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడంతో బీసీలు నష్టపోయారని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుందన్న నమ్మకం బీసీలకు ఉందన్నారు. బీసీ కులగణనకు జీవో నంబరు 18 విడదలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు బీసీ సంక్షేమ సంఘం పక్షాణ ధన్యవాదాలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, నాయకులు నల్ల శ్రీకాంత్, బోయిని శ్రీనివాస్, బచ్చు ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం

3వ పేజీ తరువాయి

ఆంధ్రజ్యోతి : వచ్చిన దరఖాస్తులు ఎన్ని?

టీపీవో : జిల్లాలో 42942 దరఖాస్తులు ఎల్ఆర్ఎస్‌లో వచ్చాయి. ఇందులో 10492 దరఖాస్తులు పరిష్కరించాం. కలెక్టర్ సూచనల మేరకు ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఎల్ఆర్ఎస్ ఏ భూములకు వర్తించదు?

టీపీవో : ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వాటిలో నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు, ప్రభుత్వ భూములు, బఫర్ జోన్, కోర్టు కేసుల్లో ఉన్నవాటికి వర్తించదు. నాలా, బఫర్‌జోన్ ప్రభుత్వ భూములకు సంబంధించి ఇరిగేషన్ రెవెన్యూ, అధికారులు నిర్ధారిస్తారు. అలాగే మాస్టర్ ప్లాన్‌లో ఉన్నా రోడ్లలో ఉన్న వాటికి కూడా వర్తించదు. జిల్లాలో 13 మండలాలు ఉన్నప్పటికి బోయినపల్లి, ఇల్లంతకుంట, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాలకు మాస్టర్ ప్లాన్ ఉంది.

ఆంధ్రజ్యోతి : ఎల్ఆర్ఎస్‌తో ఉపయోగం ఏమిటి?

టీపీవో : ఎల్ఆర్ఎస్ ద్వారా భవన నిర్మాణాల పర్మిషన్‌లలో ఎల్ఆర్ఎస్ మినహాయింపు ఉంటుంది. 2020 నాటి మార్కెట్ ధరలే ఎల్ఆర్ఎస్ ఫీజు కింద నిర్ణయిస్తారు. దరఖాస్తు దారులు ఎల్ఆర్ఎస్ పక్రియకు సహకరించి లబ్ధి పొందాలి.

మైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ముస్లిం మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ పాలక వర్గం సభ్యులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి పాటు పడుతోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రజాపాలనను అందిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన తన భర్త గౌస్‌ను గుర్తించి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిందన్నారు. ఖబ్రస్తాన్ కోసం మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కమిటీ సభ్యులు కోరారు. దీంతో ఆమె సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో మాట్లాడి మంజూరు చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు సాదుల్లా, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు హసన్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు రాజేందర్, లక్ష్మీ, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, రవీందర్, గణేశ్‌నాయక్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, మజీద్, షరీఫ్, హైమద్, షాదుల్, జహంగీర్, ఇర్ఫాన్, బాబా, అబ్దుల్, రజాక్, లాల్‌మహ్మద్, బాబు, బుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు డీఏలను ప్రకటించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే రెండు డీఏలను ప్రకటించాలని ఆదివారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అవురం సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదు డీఏ బకాయిలు ఉన్న ప్రస్తుత పరిస్థితులో ఆర్థిక పరిస్థితులు బాగా లేవంటూ ప్రభుత్వం కేవలం ఒక్క డీఏను మాత్రమే ప్రకటించడం బాధకరమని తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఐదీ డీఏలు, పీఆర్సీ, మెడికల్, జీపీఎఫ్, సరెండర్ లీవ్ వంటి అనేక రకాల బిల్లులు ధనవంతమైన తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఈ అంశాలను పరిష్కరిస్తామని పెట్టుకొని అధికారంలోకి వచ్చాక దాటవేత ధోరణిని అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వ వైఖరిని డీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

పోలీసుల పహారాలో సమావేశం

- ఒకే కమిటీ ఆధ్వర్యంలో

బ్రహ్మోత్సవాల నిర్వహణకు నిర్ణయం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశం పోలీసుల పహారాలో కొనసాగింది. కొంత కాలంగా ఆలయానికి మూడు కమిటీలు తామంటే తామేనని ముందుకొస్తున్నాయి. కార్తీక పౌర్ణమికి స్వామివారి బ్రహ్మోత్సవాలను ఏటా వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాలు సమీస్తుండడంతో ఆదివారం గ్రామంలోని అన్ని కుల సంఘాలతో పాటు ప్రజాప్రతినిదులు, యువకులు హాజరై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. దాంతో మూడు కమిటీలకు చెందిన సభ్యులతోపాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఇరు వర్గాల మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. తాము నిర్వహిస్తామంటే తాము నిర్వహిస్తామని పేర్కొనడంతో ఉద్రిక్తతంగా మారింది. ముందుస్తు సమాచారంతో పోలీసులు అధిక సంఖ్యలో బందోబస్తు చర్యలు చేపట్టారు. సుమారు 4 గంటల పాటు ఆందోళన చోటు చేసుకుంది. గ్రామస్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

పేదల జెండాకు పూర్వ వైభవం

వీర్నపల్లి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కార్మికుల పక్షాన నిలబడి పోరాడే ఎర్రజెండాకు పూర్వవైభవం తీసుకొస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు (మార్క్సిస్టు) పార్టీ మహా సభను జిల్లా కమిటీ సభ్యులు ఎగుమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భారత కమ్యూనిస్టు పార్టీ జెండాను గ్రామ గ్రామాన ఎగరవేస్తామన్నారు. సీపీఎం నాయకులు గుంటుకు నరేందర్, భూక్య వెంకట్, రాజేల్లయ్య, దేవయ్య, చంద్రయ్య జాఫర్, అంజయ్య, మనోజ్, దినకర్, రాములు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

వేములవాడ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం నాంపెల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో అనుపురం, సంకేపల్లి గ్రామాల్లో వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమన్నారు. రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకల్పమని, సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 20 సంవత్సరాల క్రితం దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు, ప్యాక్స్, డీసీఎంఎస్‌కు అప్పజెప్పామన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్‌పై తొలి సంతకం చేశారన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు మేలు కలిగే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతిక సమస్యతో మాఫీ కానీ రైతుల ఖాతాల్లో జమ చేయడానికి వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతులు 17శాతం తేమ వచ్చాక ధాన్యం తూకం వేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారని అన్నారు. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్ రెడ్డి, వైస్ చైర్మన్ శీలం రామచంద్రం రెడ్డి డైరెక్టర్ లు బొజ్జ భారతి, చిలువేరి సత్తయ్య, కాశ శ్రీనివాస్ ఛిజడల రవి, జడల నాగరాజు యాదవ్ తదాతరులు ఉన్నారు..



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి : రైతుల సక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం సనుగుల, ముడపల్లి గ్రామాల్లో సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటే చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలసి ఆదివారం పారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం అన్నారు. 20 సంవత్సరాల క్రితం దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు, సింగిల్ విండోలకు, డీసీఎంఎస్‌లకు అప్పజెప్పడం జరిగిందని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్ పై తొలి సంతకం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మంజూరైన ఒకే ఒక యారన్ డిపోను చేనేత క్లస్టర్‌గా పేరొందిన వేములవాడకు తీసుకురావడం జరిగిందన్నారు. ఇటీవల మూడపల్లి గ్రామంలో ప్రజల సౌకర్యం నిర్మాణానికి రూ 82 లక్షల నిధులు మంజూరు చేశానని గుర్తు చేశారు. గల్ఫ్ కార్మికులను గత ప్రభుత్వ మోసం చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో గల్ఫ్ కార్మికులకు జీవో తెచ్చి గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఐదు లక్షల వేములవాడ నియోజకవర్గంలోని మొట్టమొదటిది ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పు చేసిందని ప్రజా ప్రభుత్వంలో వచ్చే రాబడి గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీ కట్టడానికి పోతుండ్నారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు కోరుకునేదే చేస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు.